వడ్రంగులకు రూ.5లక్షల బీమా

కడప అర్బన్ : టిడిపి అధికారంలోకి రాగానే వడ్రంగులకు రూ.5లక్షల వరకు జీవిత బీమా, 5 సంవత్సరాల పాటు చెల్లిస్తామని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం వైఎస్ఆర్ ఆడిటోరియంలో నగర వడ్రంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ రాజకీయ కక్షతోనే అన్నా క్యాంటిన్లు కూల్చివేశారని విమర్శించారు. పక్క రాష్ట్రంలో అమ్మ క్యాంటిన్ అక్కడి సిఎం స్టాలిన్ కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. నిర్మాణరంగ కార్మికుల నోట్లు జగన్ మట్టి కొటారన్న విషయం వడ్రంగులు గుర్తుంచుకోవాలని చెప్పారు. కడప ఎంఎల్ఎ అభ్యర్థి మాధవి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని తెలిపారు. రైలు ప్రమాదానికి గురైతే హెలికాప్టర్లో సర్వే చేసిన ఏకైన సిఎం జగన్ అని ఎద్దేవ చేశారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, సంఘం ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

వేడెక్కిన పులివెందుల రాజకీయం

- సందిగ్ధంలో 'సతీష్'
- ఆయన పయనం ఎటో!
- సొంత గూటికా.. ప్రత్యర్థి గూటికా...
- మంతనాల్లో వైసిపి, టిడిపి నాయకులు

సతీష్‌రెడ్డితో మంతనాలు చేస్తున్న వైసిపి, టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్/ వేంపల్లె

ఎన్నికలు సమీపించే కొద్దీ పులివెందుల నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కుతోందని చెప్పవచ్చు. డిప్యూటీ శాసనమండలి మాజీ చైర్మన్ ఎస్ వి సతీష్ కుమార్ రెడ్డి చుట్టూ రాజకీయం తిరుగుతుంది. 30 సంవత్సరాలుగా కుటుంబంతోపాటు తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేస్తూ ఏడాదికి ఏడాది ఓట్ల శాతం పెంచుకొంటూ వచ్చారు. 2019 ఎన్నికలలో వైసిపి అధికారం చేపట్టడంతో తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. అప్పటి నుంచి నుంచి తటస్థంగా వచ్చారు. ఎన్నికలలో సమీపించడంతో వైసిపి, టిడిపి నాయకులు తమ పార్టీలోకి రావాలంటూ దూతలను పంపారు. ఇరు పార్టీ నేతలకు తమ అనుచరులతో చర్చించిన తర్వాత రాజకీయాల గురించి ఆలోచిస్తానని చెప్పడంతో ఉత్కంఠ నెలకొంది.

సొంత గూటికా.. ప్రత్యర్థి గూటికా...

ఎస్.వి సతీష్ కుమార్ రెడ్డి తెలుగుదేశం పార్టీలోకి వెళ్తారా?, లేక ప్రత్యర్థి వైఎస్ఆర్ పార్టీకి వెళ్తారా అన్నది తేడాల్సి ఉంది. శనివారం వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, రామసుబ్బారెడ్డి దాదాపు గంట పాటు సతీష్ తో ముంతనాలు జరిపారు. స్వయానా ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని వారు సతీష్ రెడ్డితో చెప్పారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటెక్ రవి, మాజీ జడ్‌పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఉదయం హుటాహుటీనా సతీష్ రెడ్డి ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఇరు పార్టీల నేతలు ఆహ్వానించడంతో సతీష్ రెడ్డి ప్రయాణం ఎటు అన్న సందిగ్ధత నెలకొంది. ఇదీలా ఉండగా సతీష్‌రెడ్డి స్నేహితుడైన విజయవాడ ఎంపీ కేశినేని నాని టిడిపి నుంచి ఇటీవలే వైసిపిలో చేరిన విషయం తెలిసిందే. ఈయన కూడా నాని బాటలోనే వెళ్తారని ఊహాగానాలు విన్పిస్తున్నాయి. ఇద్దరికీ అనుచరులతో చర్చించిన తర్వాత తమ అభిప్రాయాన్ని తెలుపుతానని చెప్పడం జరిగింది.

కలిసొస్తున్న సొంత ఓటు బ్యాంకు

సతీష్ రెడ్డికి పార్టీతో సంబంధం లేకుండా సొంత ఓటు బ్యాంకు ఉన్నారు. దీంతో వైసిపి నాయకులు ఆయన చుట్టూ తిరుగుతున్నారని విశ్లేషకులు అంటున్నారు. ఎన్నికల్లో బిటెక్ రవి పోటీ చేసి డిపాజిట్ కూడా తెచ్చుకోలేకపోయారు. సతీష్ ఒడ్డి పోటీ చేసినప్పుడు 30 శాతం పైగానే ఓట్లు రావడం జరిగింది. అందులోనూ ఆయనకు వేంపల్లి, చక్రాయపేట మండలాల్లో మంచి పట్టున్న నేతగా గుర్తింపు ఉండడంతో ఆయన కోసం ఇరు పార్టీలు ఆరాటపడుతున్నాయి. ప్రస్తుత రాజకీయాలను బట్టి ఆయన వైసిపి వైపే మొగ్గుచూపుతారనేది ప్రజల్లో జోరుగా చర్చ సాగుతుంది. ఏది ఏమైనా ఉత్కంఠకు తెరపడాలంటే కొద్ది రోజులు వేచి ఉండాల్సిందే.

గ్రూప్-2 పరీక్ష ప్రశాంతం

- 23,807 మందికి గాను 20,316 అభ్యర్థులు హాజరు
- 3,491 మంది గైర్హాజరు

వేంపల్లె : ట్రిపుల్‌ఐటి కేంద్రంలో పరీక్షకు హాజరైన అభ్యర్థులు

ప్రజాశక్తి - కడప

జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-2 ఉద్యోగాల నియామకం కోసం ఆదివారం నిర్వహించిన స్క్రీనింగ్ టెస్టుకు సంబంధించి జిల్లాలోని 67 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 23,807 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 20,316 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. దీంతో 85.34 శాతం అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పర్యవేక్షించాయి. డిఆర్‌ఓ గంగాధర్ గౌడ్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. **వేంపల్లె :** మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో నిర్వహించిన గ్రూపు - 2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ట్రిపుల్ ఐటీలో రెండు సెంటర్లును అధికారులు ఏర్పాటు చేశారు. రెండు సెంటర్లలో 1001 మంది పరీక్షలకు హజరు కావాల్సి ఉండగా 303 మంది నిరుద్యోగులు పరీక్షలకు గైహజరు అయినట్లు అధికారులు చెప్పారు. పరీక్షలకు ముందు అభ్యర్థులను తనీఖీలు చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. ఫోన్లు బయట పెట్టి లోపలికి పంపించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రిమ్స్‌లో క్రిటికల్ కేర్ సేవలకు నాంది

క్రిటికల్ కేర్ శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, వైద్యులు

ప్రజాశక్తి - కడప

కడప రిమ్స్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్) లో రూ.23.75 కోట్ల కేంద్ర నిధులతో ఏర్పాటు చేసిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ (సిసిబి) ఏర్పాటు కోసం దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం సాయంత్రం వర్చువల్ విధానం ద్వారా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆద్వర్యంలోని పిఎం -ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ మిషన్ పథకం అమలులో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రధాన ఆస్పత్రులతో పాటు కడప రిమ్స్ జిజిహెచ్‌లో రూ.23.75 కోట్ల నిధులతో క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) ఏర్పాటుకు రాజ్ కోట్ నుంచి కేంద్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి మంత్రి మన్సుఖ్ మాండీయతో కలిసి ప్రధాని నరేంద్ర మోడీ శిలాఫలకాన్ని వర్చువల్ విధానం ద్వారా ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 47,775 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు అంతస్థులతో క్రిటికల్ కేర్ యూనిట్ భవనాన్ని నిర్మించనున్నారు. అందుకుగాను రూ. 16.63 కోట్లు భవన నిర్మాణ పనులకు గాను, రూ.7.12 కోట్లు సంబంధిత వైద్య పరికరాల కొనుగోలుకు ఖర్చు చేయనున్నారు. రిమ్స్ సెమినార్ హాలులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ప్రిన్సిపల్ వరలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ శారద, ఎపి ఎంఎస్ఐడిసి ఇఇ చంద్ర మౌళీశ్వర్ రెడ్డి, డిసిహెచ్ఎస్ హిమదేవి, సురేశ్వర్ రెడ్డి, జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల నుంచి వైద్యులు, ఎఎన్ఎంలు, ఆశాలు, ప్రధాని కార్యక్రమాన్ని లైవ్ ద్వారా వీక్షించారు.

ఎపి జెఎసి నిర్ణయం సరికాదు : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకనుగుణంగా నిలబడి పోరాటం చేయాల్సిన ఏపి జెఏసి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత సాధించకుండానే ఈ నెల 27న 'చలో విజయవాడ' పిలుపును వాయిదా వేయడం సరైనది కాదని, జెఎసి నిర్ణయాన్ని యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు తెలిపారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ 27న జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి పోలీసులు అడ్డగిస్తారని మూడు రోజులు ముందే విజయవాడ చేరుకున్నట్లు తెలిపారు. వాయిదా కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయిల ఆకాంక్షలను నీరుగార్చే విధంగా ఉందని పేర్కొన్నారు. పిఎఫ్, ఏపిజిఎల్ఐ తదితర ఆర్థిక బకాయిలు రూ.20వేల కోట్లపై ప్రభుత్వం ఏ విధమైన స్పష్టత ఇవ్వకుండా మినిట్స్ జారీ చేశారన్నారు. 11వ పిఆర్‌సి బకాయిల చెల్లింపుపై ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. ఇంటీరియమ్ రిలీఫ్ ఇవ్వకుండా పిఆర్‌సిని అమలు చేస్తామని చెప్పడం బూటకమని వారు విమర్శించారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ పోరాటాన్ని కొనసాగించాలని కోరారు. జెఎసి పోరాటం కొనసాగించని పక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన యుటిఎఫ్ ఒంటరిగానైనా పోరాడుతుందని తెలిపారు.

విజేతలుగా నిలిచిన వారితో అతిథులు

రోబోటిక్ టెక్నాలజీ అభినందనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యాసారగ్ ఆసుపత్రిలో రాయలసీమలోనే మొదటి సారి ప్రపంచప్రసిద్ధి గాంచిన రోబోటిక్ టెక్నాలజీ మోకాలు, కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలో తీసుకురావడం అభినందనీయమని జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు అన్నారు. ఆదివారం విద్యాసాగర్ ఆసుపత్రిలో రోబోటిక్ టెక్నాలజీని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ రోబోటిక్ ద్వారా మోకాలు మార్పిడి, పాక్షిక మార్పిడి, తుంటి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స రివిషన్ నీ రీప్లేస్మెంట్ సిటి రేడియేషన్ అవసరం లేకుండా చేయగలమని చెప్పారు. శస్త్రచికిత్స నైపుణ్యంతో పాటు అత్యాధునిక కట్టింగ్ ఎడ్జ్ టెక్నాలజీ వాడడంలో ఎప్పుడు ముందుంటామని పేర్కొన్నారు. రోబోటిక్ టెక్నాలజీ డిజైన్ చేసిన బృందంతో చర్చల తరువాత ఈ టెక్నాలజీని తీసువచ్చుమని తెలిపారు. రాయలసీమలో రోబోటిక్ ఆర్థోప్లాస్టీ నిర్వహించే మొదటి కేంద్రంగా విద్యాసాగర్ ఆసుపత్రి నిలిచిందని చెప్పారు. విద్యాసాగర్ ఆసుపత్రి, విద్యాసాగర్ ఆర్థరైటిస్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్ పోటీ విజేతలకు ముఖ్యఅతిథులచే బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.శ్రీలక్ష్మి, ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, మాజీ ఎంఎల్‌సి పుత్తా నరసింహారెడ్డి, టిడిపి కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవి, రెడ్డి, యోగా నిపుణులు డాక్టర్ ఆర్. రంగనాథ్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, స్మిత్ అండ్ నెఫ్యూ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

టిడిపితోనే సామాజిక న్యాయం

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న మన్నూరు అక్బర్

టిడిపితోనే సామాజిక న్యాయం సాధమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ అన్నారు. ఆదివారం మన్నూరు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విస్తృత ప్రజా అభిప్రాయ సేకరణతో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థుల పేర్లు 99 ప్రకటించారని పేర్కొన్నారు. ఇందులో 18 మంది బిసిలు, 20 మంది దళితులు, 3 ఎస్‌టిలు, ఒకరు మైనార్టీ అభ్యర్థులు ఉన్నారని చెప్పారు. ఇందులో అందరూ విద్యావంతులేనని తెలిపారు. సామాజిక బాధ్యతతో చంద్ర బాబు, పవన్ కళ్యాణ్ కొత్తవారికి 23 మందికి అవకాశం కల్పించారన్నారు. టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి చెన్నూరు మండల పార్టీ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, డి.శ్రీనివాసులు, మైనార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మంజురు అహమ్మద్, రోషన్ పాల్గొన్నారు.

హృద్రోగులకు వైద్యసేవలు

- ఉచితంగా రూ.40 వేల ఇంజెక్షన్
- టిఫా స్కాన్ సహా ఆధునిక డయాగ్నోస్టిక్ సేవలు
- డిసిహెచ్ఎస్ కో-ఆర్డినేటర్ వై.హిమదేవి వెల్లడి

ప్రజాశక్తి - కడపప్రతినిధి

ముఖా ముఖి..

కమ్యూనిటీ ఆస్పత్రుల్లో కార్డియాలజీ వైద్యసేవలు అందిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం రీస్ట్రక్షరింగ్ పాలసీ ద్వారా కార్డియాలజీ మొదలుకుని స్పెషలిస్టు వైద్యుల నియామకాలను చేసింది. గుండెపోటు లక్షణాలను గుర్తించిన వెంటనే సిహెచ్‌సిలను సంప్రదిస్తే రూ.40 వేలు విలువ కలిగిన టెన్సిఫైప్లేస్ అనే ఇంజెక్షన్ ఇస్తాం. దీని ద్వారా గుండెపోటు ప్రమాదం నుంచి బయట పడే అవకాశం ఉంది. గుండెపోటు వైద్యంతోపాటు ఇతర వైద్య సేవల్లో డయాగ్నోసిస్‌కు సంబంధించిన ఎంఆర్ఐ, సిటి, టిఫాస్కాన్, ఆల్ట్రాసౌండ్ సహా అత్యాధునిక లూనార్ ఆపరేషన్ థియేటర్ల సదుపాయాలను అందుబాటులోకి తెచ్చాం. గైనిక్, యండి, సర్జరీ, పీడియాట్రిక్, కార్డియాలజీ, హౌస్ సర్జన్ తదితర నిష్టాతులైన వైద్యులతో సేవలను మెరుగు పరుస్తున్నామని పేర్కొంటున్న సందర్భంగా డిసిహెచ్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వై.హిమదే వితో ముఖాముఖి...

గుండెవ్యాధుల నివారణ చర్యలేమిటి?

ఎమర్జెన్సీ మెడికల్ కేర్ ప్రోగ్రామ్ కింద గుండెపోటును గుర్తించిన రోగులకు గంటలోపు త్రాంబోలైసిస్ ఇంజెక్షన్‌ను ఇవ్వడం జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన గ్రామీణులు గుండెపోటు లక్షణాలను గుర్తించిన వెంటనే సిహెచ్‌సిలను సంప్రదించాలి. జిల్లా కేంద్రంలోని నిష్ణాతులైన వైద్యుల సహకారంతో వైద్యసేవలు అందిస్తాం. వైద్యనిపుణుల సూచనల సహాయంతో రూ.40 వేల విలువ కలిగిన టెనక్టిపైప్లేస్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంది. వీటితోపాటు స్టెంట్ సదుపాయాల్ని అందుబాటులోకి తెచ్చాం.

కార్డియాలజీ పరికరాల ఏర్పాటుపై మీరేమంటారు?

జిల్లాలోని 14 సిహెచ్‌సిల్లో ట్వెల్వ్‌లీడ్ ఇసిజిలు, డీఫిబ్రిలేటర్స్, సంబంధిత ఇంజెక్షన్లు, మందులను అందుబాటులోకి ఉంచాం. ఇందుకు గానూ జిల్లాకు 16 సెల్‌ఫోన్స్ పంపిణీ చేశామని తెలిపారు. హృద్రోగ లక్షణాల బారిన పడిన రోగులు కలిగిన సిహెచ్‌సిల నుంచి కార్డియాలజీ వైద్య నిపుణుల సెల్‌ఫోన్స్‌కు మోగుతూనే ఉంటుంది. ఈమేరకు వైద్య సిబ్బ ందికి మూడు విడతలుగా శిక్షణను సైతం పూర్తి చేశాం.

సిహెచ్‌సి ఆస్పత్రులు ఎన్ని?

ఉమ్మడి జిల్లా పరిధిలో 10 సిహెచ్‌సి ఆస్పత్రులున్నాయి. వీటితోపాటు ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి, పులివెందుల ఏరియా ఆస్పత్రి ఉన్నాయి. ఇందులో సుమారు 24 రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంచడమైంది.

ఓపి సేవల వివరాలు తెలపండి?

జిల్లాలోని 10 సిహెచ్‌సిల్లో నెల వారీగా 12,0401 ఔట్‌పే షెంట్లకు వైద్యసేవలు అందుతున్నాయి. 94 శాతం సేవల్లో పెరుగుదల కనిపిస్తోంది. వీటితోపాటు సుమారు 24 రకాల ల్యాబ్, ఎక్స్‌రే సేవలు అందుబాటులో ఉన్నాయి.

ఐపి సేవల గురించి చెప్పండి?

డిసిహెచ్ఎస్ పరిధిలో జనవరిలో 10,646 ఇన్‌పేషెంట్ రోగులున్నారు. గతంలో 93 శాతం ఆపరేషన్స్ పెరగడం గమనార్హం. ఇందులో ఆపరేషన్స్, ఎఫిఎస్ డెలివరీస్, లాబ్‌టెస్ట్‌ల సంఖ్య అమాంతంగా పెరిగింది.

అత్యాధునిక వైద్యసేవలను వివరించండి?

హైరిస్క్ గర్భిణులు, అనీమియా రోగులకు సెకెండరీ హెల్త్‌కేర్ హాస్పిటల్స్‌లో ఆదునిక వైద్య సేవలు అందుబాటులోకి తేవడమైంది. అనీ మియా రోగులకు ఐరన్, సుక్రోస్ ఇంజెక్షన్స్, బ్లడ్‌ట్రాన్స్‌ఫర్మేషన్ సదుపాయాలున్నాయి. సిజేరియన్ ఆపరేషన్స్, డెలివరీస్ నిర్వహణకు అవసరమైన అత్యాధునిక పరికరాలు, లూనార్ ఆపరేషన్ థియేటర్ వంటి అత్యాదునిక సదుపాయాలున్నాయి. వీటిసహాయంతో కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నాం.

గర్భిణులకు గల సదుపాయాలు ఏమిటి?

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ప్రతినెలా గర్భిణులు హెల్త్ చెకప్‌నకు ఉచిత ప్రయాణ సేవలను అందుబాటులోకి తేవడమైంది. డెలివరీస్‌తో పాటు డేకేర్ ట్రీట్‌మెంట్ సదుపాయాన్ని అందుబాటులోకి ఉంచడ మైంది. గర్భస్థ శిశు ఆరోగ్య పరిస్థితిని సమీక్షించడానికి టిఫా స్కాన్ నిర్వహణకు ఆరోగ్యశ్రీ సదుపాయం కలిగిన ప్రయివేటు స్కానింగ్ సెంటర్‌లో ఉచిత సేవలు పొందేందుకు చర్యలు తీసుకోవడమైంది.

టెలీ మెడిసిన్ సేవలు గురించి తెలపండి?

ప్రొద్దుటూరు సిహెచ్‌సి పరిధిలో టెలిమెడిసిన్ సేవలు అందిస్తున్నాం. గైనకాలజీ, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, విభాగాల్లో టెలి మెడిసిన్ సదుపాయాలున్నాయి. రోజూ 500 నుంచి 700 మందికి టెలీసేవలను అందిస్తున్నాం.

డయాలసిస్ కేంద్రాల గురించి చెప్పండి?

జిల్లాలో ప్రొద్దుటూరు, పులివెందుల సిహెచ్‌సిల్లో డయాలసిస్ కేంద్రాలున్నాయి. తాజాగా బద్వేల్ సిహెచ్‌సిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. ఇన్‌స్టాల్ చేయడం జరిగింది. పిపిపి మోడ్‌లో ప్రయివేటు సంస్థకు నిర్వహణ బాధ్యతలను అప్పగించాల్సి ఉంది.

ఘోర రోడ్డు ప్రమాదం

- లారీని ఢీకొన్న స్కార్పియో వాహనం
- ఐదుగురు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు రైతులు

అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం బార్లపల్లె వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఐదుగురు దుర్మరణం చెందారు. వివరాలు..

దుర్మరణం చెందిన యువకులు

ప్రజాశక్తి- మదనపల్లె (అన్నమయ్య జిల్లా)

మదనపల్లె రామారావు కాలనీకి చెందిన ఆరుగురు స్కార్పియో వాహనంలో బెంగుళూరుకు వారి సొంత పనిపై వెళ్లారు. పని ముగించుకుని ఆదివారం బెంగుళూరు నుంచి మదనపల్లెకు తిరుగు పయనమయ్యారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో మండలంలోని బార్లపల్లె వద్దకు రాగానే అప్పుడే పాలు పోయడానికి బైక్‌పై వెళ్తున్న కోళ్లవారిపల్లెకు చెందిన ఇద్దరు రైతులు చంద్ర (50), సుబ్రహ్మణ్యం (62) ను కారు ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. అక్కడి నుంచి తప్పించుకునే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని కారు వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో కారులోని ముగ్గురు తిలక్, విక్రమ్, శ్రీను కూడా అక్కడికక్కడే దుర్మణం చెందారు. కారులో ఉన్న మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి, సిఐ సోమశేఖర్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన వారందరూ మదనపల్లి పట్టణం, రూరల్ మండలానికి చెందిన వారు కావడంతో తీవ్ర విషాదం నెలకొంది. కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతోనే ప్రమాదం జరిగిందని బార్లపల్లె వాసులు పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మదనపల్లె నియోజకవర్గ వైసిపి కన్వీనర్ నిస్సార్ అహ్మద్ పరామర్శించారు.

మృతిచెందిన రైతులు చంద్ర, సుబ్రహ్మణ్యం

బలిజ భవన్‌ను నిర్మిస్తాం : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా కేంద్రంలో బలిజ భవన్ నిర్మిస్తామని డిప్యూటీ సిఎం అంజాద్‌బాష, మేయర్ సురేష్‌బాబు హామీ ఇచ్చారు. ఆదివారం బలిజ ఐక్యవేదిక నాయకులు దుర్గాప్రసాద్, బిజెపి నాయకులు చలపతి, సిపిఐ నాయకులు చంద్ర, జనసేన నాయకులు రంజిత్‌కుమార్, వైసిపి నాయకులు సుదర్శన్, తోట కృష్ణ, బలిజ పెన్షనర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం అంజాద్‌బాష, మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ నగరంలో అధికసంఖ్యలో బలిజ కులస్తులు ఉన్నారని పేర్కొన్నారు. బలిజ భవన్ ఏర్పాటు చేస్తే సామాజికంగా ఎదగడానికి ఆస్కారం ఉంటుందని చెప్పారు. 2 రోజుల్లో బలిజ నాయకుల ద్వారా పరిశీలించి కలెక్టర్ ద్వారా సిసిఎల్ఎకు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఎంపి అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరలో ల్యాండ్ క్లియర్ చేసి భవనానికి కావలసిన నిధులు సేకరిస్తామని పేర్కొన్నారు. బలిజలకు కలగా మిగిలిన భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు.

డ్రైయినేజీ నిర్మాణం పనులు పరిశీలన

ప్రజాశక్తి - కలసపాడు

మండలంలో రూ. 34 లక్షలతో చేపట్టిన డ్రేయినేజీ పనులను ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అల్లాబకాష్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ డ్రైయినేజీ పొడవు, వెడల్పులు సక్రమంగా లేవని, చేసే పనిలో నాణ్యత తప్పనిసరిగా ఉండాలని సూచించారు. వీటన్ని ఒటినీ సరిచేసుకోవాల్సిన బాధ్యత మీ పైన ఉందని మందలించారు. క్యూరింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఆయన వెంట రాంబాబు, వీరారెడ్డి ఉన్నారు.

నాడీ వ్యాధులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్

నాడీ సంబంధిత వ్యాధులపై గ్రామీణ, మారుమూల గిరిజన ప్రాంతాలలో మరింత అవగాహన కల్పించేలా ట్విన్ డిస్ట్రిక్ట్ న్యూరో క్లబ్ సంస్థ కార్యక్రమాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యూరో వైద్యుల సంఘం (ఏపి ఎన్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పి విజయ సూచించారు. ఆదివారం నగరంలోని ద్వారకా నగర్‌లో వైయస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన న్యూరో సర్జన్లు, న్యూరో ఫిజీషియన్లు సమావేశయ్యారు. ట్విన్ డిస్ట్రిక్ న్యూరో క్లబ్ క్లబ్‌ను ప్రారంభించి, లోగోను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ విజయ మాట్లాడుతూ సమాజంలోని ప్రజానీకానికి నరాల వ్యాధుల గురించి మరింత అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మారుతున్న కాలానుగుణంగా, మానవుని జీవనశైలిలో అనేక మార్పులు వస్తున్నాయని తెలిపారు. కార్లలో ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్, అలాగే ద్విచక్ర వాహనాలలో ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలను కొంతవరకైనా అరికట్టవచ్చని చెప్పారు. అనంతరం ఎపి న్యూరో వైద్యుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఐ.బాబ్జి శ్యామ్ కుమార్ మాట్లాడుతూ వైసిపి కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన న్యూరో వైద్యులంతా ఈ సంస్థ ద్వారా సంఘటితంగా ఉండాలని ఉద్బోధించారు. సంఘం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షులు అవ్వారు అర్జున్ కుమార్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు నాడీ సంబంధిత వ్యాధుల పట్ల మరింత చైతన్య పెంపొందించేలా సంఘం ద్వారా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ట్విన్ డిస్ట్రిక్ న్యూరో క్లబ్ కు ఐఎంఎ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు.

వైసిపిలో పలు కుటుంబాలు చేరిక

ప్రజాధక్తి- కడప

కడప నగరంలోని 19వ డివిజన్ పూసల వీధిలో చౌడమ్మ దేవాలయం ప్రాంతంలో కార్పొరేటర్ శిరీష లక్ష్మయ్య ఆధ్వర్యంలో తన్నీరు రమణ, సురేంద్ర కుటుంబ సభ్యులు, మిత్ర బృందం తో పాటు 75 కుటుంబాలు ఆదివారం వైసిపిలో చేరారు. వారికి వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపి పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి అని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరికీ సమచితస్థానం కల్పిస్తామని చెప్పారు. వైసిపిని నమ్ముకున్న వారికి అన్యాయం జరగదని తెలిపారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు ముఖ్య నాయకులు, ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధి జరిగేనా..!

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం- కాంప్లెక్స్ గదుల నిర్మాణానికి మంజూరుకాని అనుమతులు

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం బ్యాంక్ అభివృద్ధి ఏళ్ల తరబడి కుంటుపడుతూనే ఉంది. ప్రభుత్వాలు, పాలకులు మారినా శిథిలావస్థలో ఉన్న సహకార సంఘం బ్యాంకును అభివృద్ధిలోకి తీసుకు రాలేకపోతున్నారు. అల్లాడుపల్లె రైతు సహకార సంఘం లాభాల బాటలో నడుస్తుండడం, 40 సెంట్ల స్థలం ప్రధాన రహదారి వెంట అందుబాటులో ఉంది. శిథిలావస్థలో ఉన్న భవనం రూపు రేఖలు మార్చడానికి నిధులు మంజూరైనా ప్రభుత్వ నిబంధనలు అవసరమైన పత్రాలు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతున్నట్లు తెలుస్తోంది. ఏడాది క్రితం గోదాము నిర్మించుకుకు, కాంప్లెక్స్ గదులు నిర్మాణానికి డిసిసి బ్యాంక్ 1శాతం వడ్డీ రేటుతో రూ.కోటికి పైగా రుణం ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. నూతన గదుల నిర్మాణానికి అవసరమైన మ్యాప్‌ను కూడా సిద్ధం చేశారు. అయితే డిసిసి బ్యాంక్ రుణం మంజూరు చేయాలంటే పంచాయతీ అనుమతులు కావాలని నిబంధన ఉంది. పంచాయతీ అనుమతుల కోసం సొసైటీ బ్యాంకు సిబ్బంది వెళ్లగా సొసైటీకి సంబంధించిన స్థలం ఆన్‌లైన్‌లో లేకపోవడంతో వన్ బి పెండింగ్‌లో ఉంది. సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం బ్యాంకు ఆవరణానికి చెందిన భూమి సర్వే నెంబర్ 71/3లో ఉందని, ఈ పొలం సొసైటీ పేరుతో కాకుండా మిగులు భూమి కింద 2 చోట్ల ఖాతాలో ఉందని తెలిపారు. ఈ పరిస్థితిలో సొసైటీ పేరుతో ఉన్న రిజిస్టర్ పత్రాలు, ఇతర ఆధారాలతో గత ఏడాది నుంచి రెవెన్యూ సిబ్బందిని సమస్యను పరిష్కరించాలని సొసైటీ సిబ్బంది కోరుతున్నారు. తహశీల్దార్ కార్యాలయం నుండి ఆర్డీవో కార్యాలయానికి, అక్కడి నుండి జెసికి సంబంధిత పత్రాలను పంపినప్పటికీ నేటి వరకు సొసైటీ వన్ బి సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. అభివృద్ధి పనులు రోజురోజుకూ కుంటుపడుతున్నాయి. డిసిసి బ్యాంకు సిబ్బంది పంచాయతీ అనుమతి ఇవ్వగానే రుణాన్ని అందిస్తామని చెబుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా రెవెన్యూ సిబ్బంది సమస్య పరిష్కరించడం లేదని సొసైటీ సిబ్బంది పేర్కొంటున్నారు. అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘానికి సంబంధించిన స్థలం ఆన్‌లైన్ నమోదు చేసి 1బి మంజూరు చేస్తే 32 షాపింగ్ కాంప్లెక్స్ రూముల నిర్మాణానికి అవకాశం ఉంటుంది. తద్వారా సొసైటీ అభివృద్ధికి మరింత చేదోడువాదోడుగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సొసైటీ భూమికి సంబంధించిన ఆన్‌లైన్ సమస్యను పరిష్కరించి, కాంప్లెక్స్ గదుల నిర్మాణానికి సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శిథిలావస్థలో అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం, బ్యాంకు కాంప్లెక్స్ గదుల ఏర్పాటుకు అనువైన స్థలం

శుద్ధినీటి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ముద్దనూరుపల్లి గ్రామంలో ఆదివారం శుద్ధినీటి పథకాన్ని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, రాష్ట్ర అటవీశాఖ చైర్మన్ జి.దేవేంద్రరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసిన శుద్ధినీటి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో శుద్ధినీటి పథకాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించామన్నారు. అవసరమైన గ్రామాల్లో నూతన బోర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. నీటి పంపులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ప్రజలు కూడా వేసవి కాలంలో నీటి వృధాను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్ష్మయ్య, ఉప ఎంపిపి శుభకరుణమ్మ, గ్రామ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, మాజీ సర్పంచ్ రామాంజనేయులురెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వైసిపి నాయకులు నారాయణరెడ్డి, పివి రమణారెడ్డి, జయరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి, నగిరి ప్రసాద్, మహేష్ యాదవ్, ఓబులరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బాల వీరారెడ్డి, చంద్ర, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ టికెట్ తిరుపాల్‌రెడ్డికి ఇవ్వాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పులివెందుల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ టికెట్‌ను ఆ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడు కేసిరెడ్డి తిరుపాల్‌రెడ్డికిస్తే భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని కాంగ్రెస్ నాయకులు రమేష్, శివబ్రహ్మం పేర్కొన్నారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపాల్‌రెడ్డికి ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. అందరిని కలుపుకొనిపోయే మనస్తత్వం కూడా తిరుపాల్‌కు ఉందన్నారు. కాంగ్రెస్‌లో చేరినప్పటి నుండి పులివెందుల ప్రాంతంలో ఎంతో మందిని పార్టీలో చేర్పించి అధిష్టానం వద్ద మంచి పేరు సంపాదించుకున్నారని తెలిపారు. పులివెందుల ప్రాంత ప్రజలు కూడా తిరుపాల్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని ఆశిస్తున్నారన్నారు. తిరుపాల్‌రెడ్డికి టికెట్టు కేటాయిస్తే తాము కూడా పార్టీ విజయం కోసం కృషి చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలరెడ్డి, మాజీ రాజ్యసభలు తులసిరెడ్డి, డిసిసి ప్రెసిడెంట్ గుండ్లకుంట శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నజీర్‌అహ్మద్ తదితర నాయకుల ఆశీస్సులు కూడా తిరుపాల్ రెడ్డికి మెండుగా ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పులివెందుల అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తిరుపాల్‌రెడ్డికే టికెట్ కేటాయించాలని తాము అధిష్టానాన్ని కోరుతున్నామన్నారు.

అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థాన చైర్మన్‌గా ఉదయ్

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థాన నూతన చైర్మన్‌గా అల్లాడుపల్లె గ్రామానికి చెందిన జి.వై.వెంకట సుబ్బారెడ్డి (ఉదయ్ కుమార్‌రెడ్డి) నియమి తులయ్యారు. ఆ మేరకు సోమవారం ఆయన కమిటీ మెంబర్లతో చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారని గ్రామ సర్పంచ్ కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి హాజరుకానున్నారని తెలి పారు. కొన్ని నెలలుగా ఆలయ కమిటీ లేకపోవడంతో ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసి నూతన కమిటీని ఎన్నుకుంది. నూతన అభివృద్ధి కమిటీ, చైర్మన్ ప్రమాణ స్వీకారాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ఆవరణలో ఏర్పాట్లు చేశారు.

స్వామికి వెండి ఆభరణాలు అందజేస్తున్న దాతలు

ఎద్దుల కొండ్రాయుడికి వెండి ఆభరణాలు వితరణ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పవిత్ర పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ఎద్దుల కొండ్రాయుడికి దాతలు 850 గ్రాముల వెండి ఆభరణాలను వితరణ ఇచ్చినట్లు ఆలయ చైర్మన్ కుర్రాకుల వెంకటేష్, ఆలయ అధికారి శ్రీధర్ తెలిపారు. ఆదివారం అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెకు చెందిన దాత సగళా నాగిశెట్టి సతీమణి కన్యాకుమారి దంపతుల కుమారుడు భరత్‌కుమార్, సతీమణి శ్రావణి ఎద్దుల కొండ్రాయుడు స్వామికి వెండి సాలి మాల, వెండి నామాన్ని ఆలయ అధికారి శ్రీధర్‌కు, ఆలయ అర్చకులు హరి ప్రవీణ్‌కు అందజేశారు. వెండి ఆభరణాలు ఇచ్చిన దాతలకు దేవస్థానం ఆధ్వ ర్యంలో ప్రత్యేక దర్శనం చేయించి, శాలువతో సత్కరించారు. దాతల సహకారం మరువలేనిదని ఆలయ ఇఒ శ్రీధర్ అన్నారు. దాతల సహకారంతోనే ఆలయ అభివృద్ధికి దోహద పడుతుందని చెప్పారు. దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి నారాయణమ్మ నేత్రదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

తొండూరు మండలం కృష్ణంగారిపల్లి గ్రామానికి చెందిన ఉమ్మడి నారాయణమ్మ (73) శనివారం రాత్రి మరణించడంతో ఆమె కుమారులు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కోడళ్లు రమణమ్మ, లక్ష్మీదేవి, మనవళ్లు సప్తగిరి, విష్ణు, గోవర్ధన్, మనవరాలు స్వాతి నేత్రదానానికి అంగీకరించారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు అదే రాత్రి టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి పార్థివదేహం నుంచి కార్నియాలను సేకరించి, హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రతి కుటుంబం నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన వెంటనే 99665 09364, 70932 04537కు సమాచారం ఇవ్వాలన్నారు.

కార్యక్రమంలో వైసిపి నాయకులు

వైసిపిని ఆదరించండి

ప్రజాశక్తి - చక్రాయపేట

వైసిపిని ఆదరించాలని మండలంలోని గంగారపువాండ్లపల్లి గ్రామం పరిధిలో ఆదివారం ఆ పార్టీ నాయకులు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గొట్లమీట్ల, ఎద్దులవాండ్లపల్లిలో ప్రతి గడపకు వెళ్లారు. కార్యక్రమంలో వైసిపి మండల ఇన్‌ఛార్జి వై.ఎస్.కొండారెడ్డి, సర్పంచ్ నాగేశ్వరమ్మ, పార్టీ కార్యకర్త శంకర్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమీరుద్దీన్ మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవడం వల్ల కొత్త విషయాలు తెలుసు కోవ చ్చన్నారు. గ్రంథాల యంలో అన్ని అంశాల పుస్తకాలు అందుబాటులో ఉన్నా యన్నారు. విద్యా ర్థులకు వేమన పద్యాలు, సుమతి పద్యాలు, కథలు వివరించారు. విద్యార్థులు పుస్తక పఠనం ఆసక్తి పెంచు కొన్ని జ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు. సూచించారు. కార్యక్ర మంలో గ్రంథాలయ అధికారి జె శివశంకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ కోదండ రామస్వామి దేవాలయము
యస్.సి.కాలనీ, తుమ్మలూరు (గ్రా),
పెండ్లిమర్రి (మం), కడప జిల్లా.

e - Procurement Tender
NIT NO.P/COE/271/2024
Dt.11.02.2024

దేవాలయ పున:నిర్మాణము కొరకు e - Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender. apeprocurement gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

ఇట్లు : స్పాన్సర్

సతీష్‌రెడ్డిని పోగొట్టుకుంటే టిడిపికి తీవ్ర నష్టం

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డిని టిడిపి పోగొట్టుకుంటే పార్టీ తీవ్రంగా నష్టపోతుందని మాజీ జిల్లా బిసి కార్యదర్శి పివి రమణ, మాజీ వార్డు మెంబరు రామకృష్ణారెడ్డి, వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు, పొట్టిపాటి మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ టిడిపి అభివృద్ధికి సతీష్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని, అలాంటి నాయకుడిన్న టిడిపి అధిష్టానం విడిచి పెట్టడం మంచిది కాదన్నారు. పులివెందుల నియోజకవర్గంలో టిడిపి ఉనికి ఉందంటే అందుకు సతీష్‌రెడ్డినే కారణమన్నారు. అలాంటి వ్యక్తిని పార్టీలోకి ఆహ్వానించకపోవడం బాధాకరమన్నారు. వైసిపిలోకి వెళితే పులివెందుల నియోజకవర్గంతోపాటు జిల్లాలో కూడా టిడిపికి నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని వారు వివరించారు. చంద్రబాబు, లోకేష్, అచ్చెనాయుడులు సతీష్‌రెడ్డితో చర్చించాలని వారు కోరారు. టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉండి సతీష్‌రెడ్డి ప్రతి గ్రామంలో ఏజెంట్లను పెట్టుకొని టిడిపిని బలో పేతం చేశారన్నారు. పులివెందులలోని నడిబొడ్డున టిడిపి జెండా ఎగుర వేసిన వ్యక్తి అన్నారు. ప్రస్తుతం టిడిపి క్యాడర్ ఉందంటే ఆయన చలవే అన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

టిడిపిని గెలిపించండి : బిటెక్ రవి

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రజలతో మాట్లాడుతున్న బిటెక్ రవి, నాయకులు

తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని పులివెందుల నియోజకవర్గం టిడిపి అభ్యర్థి బిటెక్ రవి కోరారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో బిటెక్ రవి అన్నగారితో అడుగేద్దాంలో భాగంగా ఆదివారం సురభి గ్రామంలో లక్ష్మీపురం, పాయలోపల్లి, కుప్పగుట్టపల్లి, బోడుగుండుపల్లి,మహబూబ్‌నగర్‌లో ఇంటింటికి తిరిగారు. టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని పథకాలను వివరిస్తూ, రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాజీపేట : రానున్న సర్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ టిడిపికే పట్టం కట్టాలని, మైదుకూరు ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్ యాదవ్ గెలుపునకు ప్రజలు సహకరించాలని ఆ పార్టీ రాష్ట్ర ముస్లిం మైనారిటీ కార్యనిర్వాహక కార్యదర్శి సిద్దారం ఖాదీరుల్లా కోరారు. ఆదివారం స్థానిక టీచర్స్ కాలనీలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదీరుల్లా మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందన్నారు. టిడిపి మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.కె.బ్రదర్స్, సలా ఉద్దీన్ పాల్గొన్నారు.

గాయపడిన శ్రీరాంను పరామర్శించిన బిటెక్ రవి

వేంపల్లె : రోడ్డు ప్రమాదంలో గాయపడిన శ్రీరాంను బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల టిడిపి జిల్లా ఎస్టీ అధ్యక్షుడు మేదర రవికుమార్ తండ్రి శ్రీరాంను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. కడప పట్టణంలోని ఆసుపత్రిలో పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం కడపలో చికిత్స పొందుతున్న శ్రీరాంను బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించి, ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఆరోగ్య పరిస్థితులను తనకు తెలియజేయాలని మేదర రవికుమార్‌ను కోరారు.

గ్యారంటీ పత్రాన్ని ఇస్తున్న భూపేష్‌రెడ్డి

భవిష్యత్తు టిడిపిదే : భూపేష్ రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

భవిష్యత్తు టిడిపిదేనని జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో బాబు ష్యూరిటీ.. భవి ష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని జన సేన నాయకులతో కలిసి నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన సూపర్ సిక్స్ పథకాలను ఇంటిం టికి వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్య మంత్రిగా, తనను ఎమ్మె ల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, రాష్ట్ర కార్య దర్శి రమణారెడ్డి, దేవగుడి యూత్ నాగేశ్వరరెడ్డి, జనసేన కో-ఆర్డినేటర్ డేరం గుల జగదీష్, పవన్‌కుమార్, గ్రంధి శీను, దాదాపీర్, నాగార్జున్, మదర్‌వలి, పవన్, సుధీర్, ఫరాజ్, పతంగి హేమంత్, మస్తాన్, ఏకోబరావు, ఖలందర్, షామీర్, వినయ్, షబ్బీర్, సాదక్, అనిఫ్, భాగ్యమ్మ, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానుల పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి విద్యార్థి మృతి

ప్రజాశక్తి - చక్రాయపేట

చెన్నకేశవరెడ్డి (ఫైల్‌ఫొటో)

మండలంలోని కె.రాజుపల్లెకు చెందిన మురికినాటి చెన్నకేశవరెడ్డి (21)అనే యువకుడు ఆదివారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మురికినాటి వాసుదేవరెడ్డి ఒక్కగా నొక్క కుమారుడు చెన్నకేశవరెడ్డి సిఎంఎ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తండ్రికి సహాయంగా వ్యవసాయ బోరు దగ్గరికి వెళ్లి మృత్యువాత పడ్డాడు. గ్రామం శోకసముద్రంలో మునిగిపోయింది. తమ వ్యవసాయ భూమిలో పంటకు నీళ్లు కట్టడానికి వెళ్లి మోటర్ ఆన్ చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది.

సృజనాత్మక ఆవిష్కరణలకు ప్రాణం పోయాలి

గెలుపొందిన విజేతలతో సైన్స్ క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సి.వి.రామన్ సైన్స్ క్లబ్ ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్టు స్థానిక గీతాశ్రమంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రొద్దుటూరు డివిజన్ ఉప విద్యా శాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నూతన సృజనాత్మక ఆవిష్కరణలకు ప్రాణం పోయాలన్నారు. అప్పుడే వైజ్ఞానిక ప్రగతి పరుగులు తీస్తుందని తెలిపారు. సివి రామన్ సైన్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ కె.వి.విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు కాలంలో సైన్స్ విద్యకు విశేషమైన ప్రాధాన్యం ఒనగూరనుందన్నారు. చీకటి నుంచి వెలుగును ప్రసరింపజేయడానికి శాస్త్రజ్ఞులు సరికొత్త బాటలు వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబద్ధత, నిజాయితీలతో మెలగాలని కోరారు. తమకున్న సామర్థ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే విద్యను అందించడమే ముందున్న లక్ష్యమని పేర్కొన్నారు. క్లబ్ కార్యదర్శి కంభం చంద్రశేఖర్ మాట్లాడుతూ నూతన వైజ్ఞానిక ఆవిష్కరణలతో మానవుడి జీవన పయనం సుఖమయంగా మారిందన్నారు. ఎంఇఒ బి.సావిత్రమ్మ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020లో పొందుపరిచిన విధంగా విద్యా బోధన, పరిశోధనలు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ పాఠశాల నుండి 200 విద్యార్థులు 75 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సి.వి.రామన్ ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్, క్లబ్ గౌరవ అధ్యక్షులు గోపీనాథ్‌రెడ్డి, రవి ప్రకాష్, మహేశ్వర్‌రెడ్డి, కళ్యాణ్‌కుమార్,గోవర్ధన్ పాల్గొన్నారు. మెమెంటోలు కాంట్రాక్టర్ కృష్ణార్జునరెడ్డి, పరీక్ష ప్యాడ్స్ ఒంటెరు శ్రీనివాసులరెడ్డి, పెన్నులు కె.వాణి, కన్సోలేషన్ బహుమతులు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు శేషశర్మ, తెలుగు మాధ్యమ ప్రథమ బహుమతులు శ్రీ రమణ మహర్షి పాఠశాల పూర్వ విద్యార్థులు అందజేశారు.

ప్రజల ఇబ్బందులను తొలగిస్తాం : సర్పంచ్ రాచినేని

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని రెడ్డినగర్ ప్రాంతంలో కుంగిపోతున్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగిస్తామని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇటీవల అండర్ డ్రయినేజీ కోసమని రోడ్డు మధ్యలో గుంతలు తీసి పూడ్చారు. అలాగే ఆ ప్రాంతంలో నీరు నిలిచి రోడ్డు గుంతల మయమైంది. పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్‌కు ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన సర్పంచ్ ఆది వారం రెడ్డినగర్ ప్రాంతంలో ఉన్న రోడ్డును పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులుతో కలిసి పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలు సర్పంచ్‌కు పలు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్డుకు మరమ్మతులు చేపడుతామని హామీ ఇచ్చారు. రోడ్డు గుంతలమయం కాకుండా చిప్స్ వేసి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి భారతి, వైసిపి నాయకులు రామగంగిరెడ్డి, కసిరెడ్డి ఆదినారాయణరెడ్డి, పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డినగర్‌లోని రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు

'మానవత' సేవలు అభినందనీయం

తారీఫ్ అలీని సన్మానిస్తున్న మానవత సభ్యులు

వేంపల్లె : పేద ప్రజలకు అందిస్తున్న 'మానవత' సేవలు అభినందనీయమని ఖాన్ కారీస్తా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తారిఫ్ అలీ చెప్పారు. ఆదివారం స్థానిక చైతన్య పాఠశాల ఆవరణలో మానవత శాఖ మాసాంతర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సంస్థకు అవసరమైనప్పుడు రక్తాన్ని ఎప్పుడు అడిగినా వెంటనే ఏర్పాటు చేస్తానని చెప్పారు. వేంపల్లెలో రక్త దాతలైన సమీర్, మదార్, నాయబ్, హాజీలు రక్తదానానికి చేసిన సేవలు ఎనలేవని చెప్పారు. వేంపల్లె మానవతా సంస్థ నూతన భవన నిర్మాణానికి మానవత చైర్మన్ చక్రపాణిరెడ్డి రూ.50 వేలు విరాళం ప్రకటించగా, మానవతా కన్వీనర్ బొజ్జ రంగారెడ్డి రూ.5 వేలు ప్రకటించారు. కార్యక్రమంలో మానవతా అధ్యక్షులు బాలాజీ, కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి శ్రావణ్‌కుమార్, కావలి ముత్యాలయ్య, శివ, సమీర్, మదర్, నాయబ్, రామమునిరెడ్డి, డాక్టర్ రాజారాం, డాక్టర్ రంగయ్య, డాక్టర్ అరుణ్‌కుమార్, లోకేష్, బత్తల చలపతి, మదర్ థెరిస్సా ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీకి సర్వం సిద్ధం

నేడు హాజరుకానున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వేల్పుల రాము

వేముల మండలం వేల్పుల గ్రామంలో (వేల్పుల రాము) లింగాల రామలింగారెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులుగా శ్రీరాముని దేవాలయం ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండవరోజు ఆదివారం పలు కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరి గాయి. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల్ని ఆకట్టుకున్నాయి. పదివేల మందికిపైగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం చేశారు. సోమవారం జరిగే రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ పోటీలకు భారీగా ప్రజలు తరలిరానున్నారు. వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వైసిపి సీనియర్ నేత రామలింగారెడ్డి తెలిపారు.

గ్రూప్-2 ప్రశ్నపత్రంలో చదువులబాబు రచన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆదివారం జరిగిన గ్రూప్-2 ప్రశ్నపత్రంలో ప్రొద్దుటూరుకు చెందిన చదువులబాబు రచన ప్రస్తావనకు వచ్చింది. వరుస సంఖ్యలో 97వ ప్రశ్నగా ప్రచురితమైంది. చదువులబాబు రచించి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన 'వజ్రాలవాన' పుస్తకం నుండి సేకరించి ప్రశ్నపత్రంలో ప్రశ్నగా అడిగారు. ఈ సందర్భంగా చదువులబాబు మాట్లాడుతూ ఉన్నత స్థాయి ఉద్యోగార్థుల కోసం తన రచనలోని అంశాన్ని ప్రశ్నించడం సంతోషంగా ఉందన్నారు. ఈ రచనకు 2023లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందన్నారు. పదిమందికి ఉపయోగపడేలా తన రచనలను ప్రభుత్వం వినియోగించడం సంతృప్తిని కలిగించిందన్నారు. పాఠకుల ఆదరా భిమానాలతో మరిన్ని ఉపయోగకర రచనలు అందిస్తానని చదువులబాబు పేర్కొన్నారు.

తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నగరశాఖ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సంఘం కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో అందరూ కలిసికట్టుగా ఉంటే ముందుకు వెళ్లేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. నగర శాఖ పటిష్టమైన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. నగరశాఖ అధ్యక్షులుగా కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా పల్లా నరసింహారావు, కోశాధికారిగా టేకూరి సుదర్శన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక కార్యదర్శిగా పల్లా మురళీకృష్ణయ్య, గౌరవ సలహాదారులుగా డాక్టర్ బండారు శ్రీనివాసులు, సంగినాథం కొండయ్య, గంజికుంట రఘురామయ్య, పోలిశెట్టి రెడ్డెయ్య, పుజల శంకర్, చౌడం లక్ష్మీనారాయణ, దండే నాగభూషణం, బొల్లు సోమశేఖర్, గౌరవాధ్యక్షులుగా సుంకర రామచంద్రుడు, డాక్టర్ పల్లా భాస్కర్, డాక్టర్ చౌడం వెంకటేష్, సంగినాథం ఆంజనేయులు, కందికండి రమేష్‌బాబు, డాక్టర్ గంజికుంట తిరుమలరావు, గాలి పుల్లయ్య, గోవిందు నాగరాజు, ఇట్టే వేణుగోపాల్, పల్లా బాల చౌడన్నను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చౌడం సూర్యనారాయణ, సానా పరమేశ్వర్, పోలిశెట్టి రఘురామయ్య, వెలిగండ్ల సుబ్బరాయుడు, ఇడెం చిన్న సుబ్బరాయుడు, బొమ్మిశెట్టి శ్రీరాములు, పూజల శ్రీనివాసులు, అంబటి నాగయ్య, బండి కృష్ణయ్య, బూశెట్టి మల్లికార్జున, గొర్రకూటి వెంకటసుబ్బన్న, దొడ్ల వెంకటరమణ, గుండ్లపల్లి ఆంజనేయులు, గోవిందు వెంకటరమణ, మోతుకూరు పుల్లయ్య, బొలిశెట్టి వెంకటస్వామి, సహాయ కార్యదర్శులుగా మోతుకూరి సుబ్బరాయుడు, సిఆర్ఐ సునీల్ జయంత్, ఉమ్మడిశెట్టి వెంకటసురేంద్ర, దండే వెంకటసుబ్బయ్య, పల్లా వెంకటసుబ్బయ్య, బడిగించల రంగనాయకులు, సుంకర శివశంకర్, సహాయ కార్యదర్శులు గోవిందు ఎద్దుల కొండ్రాయుడు, పబ్బులేటి వెంకటరమణ, వెలిగండ్ల సుబ్బయ్య, కాల్వ వాగేష్, ఇడెం సురేంద్ర, పూలజ మురళీకృష్ణ, పట్టుపోగుల సుబ్బారావు, బొలిశెట్టి వెంకటసుబ్బయ్య, కొర్రకూటి గోవిందరాజులు, పల్లా రఘు, కంచెన గంగాధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బండారు శ్రీనివాసులు, పబ్బులేటి శ్రీనివాసులు, సుంకర నారాయణ స్వామి, ఎల్లయ్య, జగన్, టేకూరి పుష్పాంగదా, ప్రభాకర్, రవికుమార్, వీరనరసింహులు, కార్యవర్గ సభ్యులు ఇ.రవికుమార్, పి.భరణితేజ, శివశంకర్, బలరాంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమిటీ ఎన్నికల్లో తమను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.తొగటవీక్ష క్షత్రియుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.